ఆంధ్రజ్యోతి

andhrajyothy.com

సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 34.5 । కనిష్ఠం 19.2



కామారెడ్డి జిల్లా వార్తలు

5

మంగళవారం 18 ఫిబ్రవరి 2025

ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు నమోదు

గాంధారి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోషల్ టీచర్‌గా పని చేస్తున్న రమేష్ అనే ప్రభుత్వ ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు నమోదైనట్లు ఎస్‌ఐ ఆంజనేయులు తెలిపారు. పాఠశాలలో చదువుకునే ఓ విద్యార్థిని పట్ల అసభ్యకరమాటలు మాట్లాడడమే కాకుండా చేష్టలు చేయడం సబ్జెక్టుకు సంబంధించిన విషయాలు ఫోన్‌లో తెలుపుతానని చెప్పి తల్లిదండ్రుల ఫోన్ నెంబర్ తీసుకుని ఫోన్‌కు అసభ్యకరంగా వాట్సాప్ మెసేజ్ చేయగా ఈ విషయం తల్లిదండ్రులకు తెలిపింది. దీంతో తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

డేంజర్.. ఆన్‌లైన్ గేమ్స్!



- ఆన్‌లైన్ యాప్ గేమ్స్‌కు అలవాటు పడుతున్న యువత
- గేమ్స్, బెట్టింగ్‌లో రూ.లక్షలు పోగొట్టుకుని అప్పుల పాలవుతున్న పరిస్థితి
- చేసిన అప్పులు తీర్చేందుకు అడ్డదారులు తొక్కుతున్న యువత
- అప్పులు తీర్చేమార్గం లేక ఆత్మహత్యలకు పాల్పడుతున్న మరికొందరు
- జిల్లాలో ఆందోళన కలిగిస్తున్న ఆన్‌లైన్ గేమ్స్ ఆత్మహత్యలు
- తాజాగా పట్టణంలో మరో యువకుడి ఆత్మహత్య

కామారెడ్డి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): తక్కువ కాలంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలని అత్యాశతో యువకులు ఆన్‌లైన్ గేమ్‌లతో రూ.లక్షలు పోగొట్టుకుంటూ వారి జీవితాలనే కాకుండా కుటుంబాలను పణంగా పెట్టాల్సి వస్తోంది. ఇటీవల కాలంలో చాలా మంది యువకులు ఆన్‌లైన్ బెట్టింగ్, గేమ్స్‌కు అలవాటు పడి అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. కామారెడ్డి జిల్లాలోనే కాకుండా నిజామాబాద్‌లోనూ ఇటీవల జరిగిన పలు సంఘటనలను పరిశీలిస్తే ఆన్‌లైన్ ఆటలతో ఎంతో మంది జీవితాలు బలవుతున్నట్లు స్పష్టమవుతోంది. ఆన్‌లైన్ బెట్టింగ్ గేమ్స్ నగర, పట్టణాల్లోనే కాకుండా పల్లెల్లోనూ యువకులు చేతిలో సెల్‌ఫోన్ పట్టుకుని ఆన్‌లైన్ ఆటల్లో మునిగి తేలుతున్నారు. కొందరు విద్యార్థులు కూడా ఆన్‌లైన్ గేమ్‌లకు అలవాటుపడి తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు. ప్రస్తుతం అందరి చేతుల్లో ఉన్న స్మార్ట్‌ఫోన్‌లకు ఏదో ఒక గేమ్‌కు, బెట్టింగ్‌కు సంబంధించిన మెసేజ్‌లు వస్తూనే ఉన్నాయి. దాన్ని క్లిక్ చేస్తే చాలు సులువుగా డబ్బులు సంపాదించుకోవచ్చనే యాడ్స్ యువతను అటువైపు తిప్పే ప్రయత్నం చేస్తున్నాయి. ఆటతో రూ.లక్షలు సంపాదించవచ్చనే భ్రమలో చాలా మంది పడిపోతున్నారు. దీంతో చాలా మంది వాటిని నమ్మి ఆ ఊబిలో దిగి అప్పుల పాలవుతున్నారు.

ఇటీవల కాలంలో జిల్లాలో జరిగిన ఘటనలు

గత ఆరు నెలల క్రితం కామారెడ్డి పట్టణంలోని విద్యానగర్‌లో ఓ యువకుడు ఆన్‌లైన్ గేమ్‌లో భారీగా నష్టపోయాడు. సుమారు రూ.12 లక్షల వరకు అప్పులు చేశాడు. అప్పు తీర్చేమార్గం తెలియక ఆత్మహత్య చేసుకున్నాడు. కొడుకును కోల్పోయామన్న తల్లిదండ్రులకు కడుపుకోత మిగిలింది. తాజాగా సోమవారం కామారెడ్డి పట్టణ శివారులోని దేవునిపల్లికి చెందిన సంజయ్ (27) ఆన్‌లైన్ గేమ్‌లో రూ.80లక్షల వరకు పోగొట్టుకుని అప్పుల పాలయ్యాడు. మనస్థాపానికి గురై ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సంజయ్ ఆత్మహత్య చేసుకోవడంతో భార్య, పిల్లలు రోడ్డున పడ్డారు. ఎల్లారెడ్డి పట్టణంలోనూ ఓ యువకుడు ఆన్‌లైన్ గేమ్‌లతో తీవ్రంగా నష్టపో యి అప్పుల పాలయ్యాడు. అప్పుతీర్చే పరిస్థితి లేక పోవడం తో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బాన్సువాడ పట్టణంలో మరో యువకుడు ఆన్‌లైన్‌లో గేమ్స్ ఆడి రూ.5లక్షల వరకు అప్పు చేశాడు. అప్పులు తీర్చే మార్గం కనిపించకపోవడంతో బయట చేసిన అప్పుల వాళ్ల ఇబ్బంది పెట్టడంతో ఇంట్లో చెప్పకుండా వెళ్లిపోయాడు. ఆయన ఆచూకీ ఇప్పటికీ తెలియరాలేదు. కామారెడ్డి జిల్లాలోనే కాకుండా నిజామాబాద్‌లోను ఓ యువకుడు ఆన్‌లైన్ గేమ్‌లతో లక్షల్లో అప్పు చేయడంతో అప్పు తీర్చే పరిస్థితి లేక యువకుడితో పాటు తల్లిదండ్రులు సైతం ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఇలా ఉమ్మడి జిల్లాలో తరచూ చోటు చేసుకుంటున్న ఆన్‌లైన్ గేమ్స్ ఆత్మహత్యలు ఆందోళన కలిగిస్తున్నాయి.

అప్పు తీర్చలేక ఆత్మహత్యలు

ఆన్‌లైన్ గేమ్స్ వల్ల తీవ్రంగా నష్టపోయి అప్పుల పాలైన సంఘటనలు జిల్లాలో చాలానే ఉన్నాయి. గడిచిన ఏడాది కాలంలో కామారెడ్డిలో ఆన్‌లైన్ గేమ్స్‌తో సుమారు 12 మంది యువకులు తీవ్రంగా నష్టపోగా ఇందులో ఆరుగురు ఆత్మహత్యలకు పాల్పడినట్లు పోలీసుల రికార్డులు చెబుతున్నాయి. ఆన్‌లైన్ గేమ్స్‌లో అప్పులు చేసి వాటిని తీర్చలేక కొంద రు బాధితులు ఆత్మహత్య చేసుకుంటున్నారు. ముఖ్యంగా యువకులు అత్యాశకు పోయి ఆన్‌లైన్ గేమ్‌లో రూ.లక్షలు కోల్పోయి రోడ్డున పడుతున్నారు. కుటుంబీకులకు చేసిన అప్పులు చెప్పలేక తీర్చే మార్గం కానరాక బలవన్మరణాలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. దీంతో వారి కుటుంబీకులకు తీరనిశోకాన్ని విధిస్తున్నారు. ఫోన్‌లో ఎక్కువ సేపు కాలక్షేపం చేస్తున్న వారిలో చాలా మంది ఆన్‌లైన్ గేమ్‌లు ఆడుతుండడం ఆందోళన కలిగిస్తోంది. ఈ నేపథ్యంలో తల్లిదండ్రులు దృష్టి సారించి వ్యసనానికి దూరం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



ఆత్మహత్య చేసుకున్న దేవల సంజయ్(ఫైల్)

అప్పులు తీర్చేందుకు అడ్డదారుల్లోకి..

జిల్లాలో ఆన్‌లైన్ గేమ్స్ మూలంగా వందలాది మంది యువకులు అప్పుల పాలైనట్లు తెలుస్తోంది. పట్టణాలే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లోని యువకులు, విద్యార్థులు బెట్టింగ్, ఆన్‌లైన్ గేమ్స్‌లలో రూ.లక్షలు పోగొట్టుకుంటున్నారు. ఆన్‌లైన్‌లో అప్పులు చేయడమే కాకుండా తెలిసిన వారి వద్ద బాకీ తీసుకుంటూ పెట్టుబడులు పెడుతున్నట్లు తెలుస్తోంది. ఒక్కోసారి ఆట తమకు అనుకూలంగా ఉండగానే మరింత ఆశతో ఎక్కువగానే బెట్టింగ్ చేస్తున్నారు. కుటుంబీకులకు తెలియకుండా అప్పులు చేసిన వారిలో కొందరు అప్పు తీర్చేందుకు అడ్డదారులు తొక్కుతున్నారు. దొంగతనాలకు పాల్పడుతూ జైలు పాలవుతున్నారు.

ఫంక్షన్ హాళ్లపై పట్టింపేదీ..!?

- కనిపించని సీసీ కెమెరాలు
- ఒకేరోజు రెండు పెళ్లిళ్లు
- ఫైర్ సేఫ్టీ పరికరాలు కరువు
- శానిటేషన్ విభాగానికి అదనపు భారం
- నిబంధనలు పాటించని యజమానులు
- పట్టించుకోని అధికారులు



7

చురుగ్గా కొనసాగుతున్న రైల్వే డబ్లింగ్ పనులు

- మహంతం రైల్వే గేటు నుంచి బాసర వరకు చురుకుగా కొనసాగుతున్న పనులు
- భూసేకరణకు అధికారులు సహకరిస్తే మరింత చురుకుగా పనులు
- 2026లోగా పనులు పూర్తి చేయాలని లక్ష్యం



7

'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా'తో ఉపాధి పనులపై ఆసక్తి

- ఏప్రిల్ 1 నుంచి ప్రారంభం కానున్న ఉపాధి పనులు
- కొత్త జాబ్ కార్డులు కావాలంటున్న కూలీలు
- ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం అమలు నేపథ్యంలో..



7

పెండింగ్ బిల్లులు చెల్లించాలని ఎంపీడీవోకు వినతి



ఎంపీడీవోకు వినతి పత్రం అందిస్తున్న గ్రామ కార్యదర్శులు

బిచ్కుంద, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): పెండింగ్ బిల్లులు చెల్లించాలని మండలంలోని గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీవోకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్పంచ్‌ల పదవి కాలంలో చేపట్టిన పనుల బిల్లులను చెల్లించాలని పంచాయతీ కార్యదర్శులు వివరించారు. గ్రామంలో చెత్త ఎత్తిపోయడానికి ప్రతిరోజూ ట్రాక్టర్‌కు, డీజిల్, బ్లీచింగ్ పౌడర్ కొనుగోలుకు నగదు అత్యవసరంగా మారిందన్నారు. ఇలాంటి సమస్యలన్నింటిని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యే విధంగా చూడాలని కోరారు.

ఘనంగా ఖండేరాయ ఆలయ వార్షికోత్సవం

సదాశివనగర్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉత్తనూర్‌లో శ్రీ ఖండేరాయ ఆలయ వార్షికోత్సవం అంగరంగవైభవంగా నిర్వహించారు. సోమవారం గ్రామ అభివృద్ధి కమిటి, గ్రామపెద్దలు ప్రజల సమక్షంలో స్వామి వారికి పట్టు వస్త్రాలను డప్పువాయిద్యాలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆలయంలో శ్రీ ఖండేరాయ-మండేలమ్మ కల్యాణాన్ని కనుల పండుగగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు, మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్‌లు ప్రత్యేకంగా హాజరై స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి కల్యాణాన్ని తిలకించారు. అనంతరం ఆలయ కమిటీ ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావును సన్మానించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ శాశ్వత ధర్మకర్త పార్శి శ్రీనివాస్‌గుప్తా, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు దోడ్ల రవి, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.



ఖండేరాయ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు



సౌత్ క్యాంపస్‌లో స్పెక్ట్రోస్కోపిపై అవగాహన కల్పిస్తున్న ప్రొఫెసర్

విద్యార్థులు పరిశోధనల వైపు మొగ్గు చూపాలి

భిక్కనూరు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పరిశోధనల వైపు మొగ్గు చూపాలని, పరిశోధన రంగంలో ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉంటాయని జేఎన్‌టీయూ ప్రొఫెసర్ రాజు చౌహాన్ అన్నారు. సోమవారం భిక్కనూరు మండలంలోని బీటీఎస్ చౌరస్తాలో తెలంగాణ సౌత్ క్యాంపస్‌లో రసాయన శాస్త్రవిభాగంలో 'స్పెక్ట్రోస్కోపి దాని అనువర్తనాలు' అనే అంశంపై ఒకరోజు పరిశోధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మంచి పరిశోధనలు చేసి ఉన్నత స్థానానికి ఎదగాలని ఆకాంక్షించారు. రసాయనశాస్త్ర పాఠ్య ప్రణాళిక అధ్యక్షుడు డాక్టర్ నాగరాజు, ఫిజిక్స్ విభాగ అధిపతి మోహన్‌బాబు అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలి

బాన్సువాడ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి):మండలంలోని బోర్లం సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ప్రతీ తరగతి గది, పాఠశాల చుట్టూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే బాలికలకు భద్రత ఉంటుందని సబ్ కలెక్టర్ కిరణ్మయికి విద్యార్థుల తల్లిదండ్రులు వినతిపత్రం అందజేశారు. గురుకుల బాలికల పాఠశాలలో పురుష ఉపాధ్యాయులను తొలగించి, మహిళా ఉపాధ్యాయులను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. సబ్ కలెక్టర్ విద్యార్థుల తల్లిదండ్రుల సమస్యలను, సలహాలను విని సానుకూలంగా స్పందించారు.

సర్వేలో పాల్గొనని వారి.. వివరాలను నమోదు చేయాలి!

కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో పాల్గొనని కుటుంబాల వివరాలను 28 వరకు వివరాలు ఎంట్రీ చేసుకునే విధంగా చూడాలని అధికారులను కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో దరఖాస్తులను స్వీకరించారు. మొత్తం 58 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. భూ సమస్యలు, రైతు భరోసా, వ్యక్తిగత సమస్యలు వంటి దరఖాస్తులు వచ్చినట్లు వివరించారు. జిల్లా, మండల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని తమశాఖకు సంబంధించిన పనులను పర్యవేక్షించాలని, క్షేత్రస్థాయిలోని అధికారులతో సమీక్షలు నిర్వహించాలని తెలిపారు. తహసీల్దార్, ఎల్‌ఆర్‌ఎస్, ధరణి వంటి వాటిని పరిశీలించి చర్యలు చేపట్టాలని తెలిపారు. మండల పరిషత్ అధికారులు ప్రాపర్టీ ట్యాక్స్, పారిశుధ్యం, సెగ్రిగేషన్ షెడ్స్, నర్సరీ, మొక్కల పెంపకం వంటి వాటిపై సమీక్షలు నిర్వహించి చర్యలు తీసుకోవాలని అన్నారు. అదేవిధంగా సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో కుటుంబ వివరాలు నమోదు చేసుకునేందుకు మండల అభివృద్ధి అధికారి కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాల్లోని ప్రజాపాలన సేవా కేంద్రాల్లో నిర్ణీత ప్రొఫార్మాలో పూర్తి వివరాలు నమోదు చేసుకోవచ్చని లేదా ప్రభుత్వం ఈ విషయంలో ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నెంబర్ 040-21111 111 నకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సదరు కుటుంబ వివరాలు తెలియజేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విక్టర్, జడ్పీ సీఈవో చందర్‌నాయక్ జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిని సక్రమంగా నిర్వహించాలి

ప్రభుత్వ ఆసుపత్రి నిర్వహణ సక్రమంగా నిర్వహించాలని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ప్రభుత్వ పాఠశాల బడి పిల్లలకు నిర్వహిస్తున్న ఉచిత కంటి పరీక్షల శిబిరాన్ని పరిశీలించారు. జిల్లాలో ఇప్పటికే 3,580 మంది విద్యార్థులకు కంటి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించామన్నారు. ఆయా పిల్లలకు మరోసారి కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన కళ్లజోళ్లు అందిస్తామన్నారు. అనంతరం ఆసుపత్రిలోని సిబ్బంది, డాక్టర్ల హాజరు రిజిస్టర్‌లను,బయోమెట్రిక్ అటెండెన్స్‌లను కలెక్టర్ పరిశీలించారు. డాక్టర్లు, సిబ్బంది సమయపాలన పాటించాలని, విధులకు సకాలంలో హాజరై రిజిస్టర్‌లో సంతకాలు చేయాలని తెలిపారు. అనంతరం మెన్స్‌వార్డు, డయాలసిస్, ఐసీయూ, కంటి శస్త్రచికిత్సల గదులను కలెక్టర్ పరిశీలించారు. ఆసుపత్రిలోని రోగులతో మాట్లాడి వైద్య సదుపాయాలపై ఆరా తీశారు. రోజువారి చెత్తను మున్సిపల్ వాహనంలో తరలించేలా చూడాలని ఆసుపత్రి సూపరిటెండెంట్ ఫరిదాభేగంకు సూచించారు. ఆసుపత్రిలో నీటి సంపును పరిశీలించి అవసరమైన మరమ్మతులు చేపట్టాలని, గార్బెజ్ నిల్వలను ప్రతిరోజూ తీసుకెళ్లే విధంగా ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో చంద్రశేఖర్, డిప్యూటీ సూపరింటెండెంట్ వెంకట్, ఆసుపత్రి వైద్యులు రాంసింగ్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలి

రాజంపేట: పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. సోమవారం రాజంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పరిశీలించారు. సోమవారం పదో తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులు చదువుతున్న తీరును ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వచ్చే వార్షిక పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని, శ్రద్ధ పెట్టి చదవాలని తెలిపారు. టీచర్ చెప్పిన పాఠాన్ని శ్రద్ధగా విని అర్థం చేసుకోవాలని, అర్థంకాని విషయాలను అడిగి తెలుసుకోవాలని అన్నారు. పరీక్ష సమయంలో ఒత్తిడికి లోను కాకుండా శ్రద్ధతో చదవాలని తెలిపారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి చదివించాలని తెలిపారు. ఏ సబ్జెక్టులో వెనుకబడి ఉన్నారో తెలుసుకుని సంబంధిత టీచర్ పర్యవేక్షణలో ప్రత్యేకంగా తరగతులు నిర్వహించాలని తెలిపారు. గత సంవత్సరం 92 శాతం మంది ఉత్తీర్ణత సాధించారని, ఈ సంవత్సరం వంద శాతం సాధించేలా విద్యార్థులను తయారు చేయాలని సూచించారు. మ్యాథ్స్ టీచర్‌గా కలెక్టర్ బోర్డుపై స్వయంగా లెక్కరాస్తు విద్యార్థులచే లెక్కలకు సమాధానాలు రాబట్టారు. విద్యార్థులు మరింత దీక్షతో చదివితే మంచి స్థానంలో రాణిస్తారని తెలిపారు. ఉదయం, సాయంత్రం వేళ ల్లో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తు వారి పురోగతికి టీచర్లు కృషి చేస్తున్నారని హెడ్ మాస్టర్ ఈశ్వరయ్య తెలిపారు. విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులను కలెక్టర్ అందించి ఆల్‌దిబెస్ట్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈవో రాజు, ఎంఈవో పూర్ణచందర్‌రావు, తహసీల్దార్ అనిల్‌కుమార్, ఇన్‌చార్జ్ ఎంపీడీవో రఘురాం, టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు



ఆర్మూర్ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



కోటగిరిలో..



కమ్మర్‌పల్లిలో..

నందిపేట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాలలో సోమవారం రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు నందిపేట మండల కేంద్రంలోని నందికేశ్వర ఆలయంలో, అలాగే చౌడమ్మ కొండూర్ గ్రామంలో చాముండేశ్వరీ ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మచ్చర్ల సాగర్, నాయకులు కోమన్‌పల్లి రాజన్న, నాయుడు రామారావు, దారం సురేష్, కొండూర్ సంతోష్, దేవిదాస్, గణేష్, సాయి, షాదుల్లా, బోగన్న, ఎస్‌కె మహిబూబ్, ఎస్ నరేష్ తదితరులు ఉన్నారు.

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం మాజీముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు జన్మదినం సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పూజ నరేందర్, నాయకులు సుంకరి రవి, మీరశ్రావణ్, శ్రీకార్, గిరిష్, కాపెల్లి గణేష్, లతిఫ్, హర్షద్, సాహెబ్, తదితరులు పాల్గొన్నారు.

వేల్పూర్:మాజీముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు 71వ జన్మదిన వేడుకలను వేల్పూర్ మండల కేంద్రంలో మండల బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కేసీఆర్ జన్మదిన కేక్‌ను మండల పార్టీ అధ్యక్షుడు జైడి నాగాధర్‌రెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు ప్రతాప్ రెడ్డి కేక్ కట్ చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జైడి నాగాధర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, నీరడిబాగ్య రేగుల్ల రాములు, సొసైటీ చైర్మన్ తదితరులు పాల్గొన్నారు.

వర్ని: వర్ని మండలంలో సోమవారం బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో రాచప్ప, నరేడ్ల శ్రీను, తిప్పారావు, ఆనంద్ గౌడ్, పాల్గొన్నారు.

మెండోర: మండల కేంద్రంలో మాజీసీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని మండల అధ్యక్షుడు డీసీసీబీ డైరెక్టర్ నాగంపేట్ శేఖర్ ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలోతలారిగంగాధర్, నవీన్‌గౌడ్, కమలాకర్, మచ్చర్ల రాజారెడ్డి, గోపిడి గంగారెడ్డి, రవిగౌడ్, సతీష్, రాజు, పాల్గొన్నారు.

మోస్రా: మోస్రా, చందూర్ మండల కేంద్రాలతో పాటు మండలంలోని గ్రామాల్లో బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ పుట్టిన రోజు సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రశాంత్ రెడ్డి, కోతిమీర్‌కర్ విజయ్,కార్యకర్తలు పాల్గొన్నారు.

నవీపేట: తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర్ రావు జన్మదిన వేడుకలను సోమవారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో కేక్ కట్ చేసి రోగులకు పండ్లు, బ్రెడ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు నర్సింగ రావు, తెడ్డు పోశెట్టి, ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

ఏర్గట్ల: మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం వద్ద సోమవారం మాజీ సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు కేక్ కట్ చేసి కేసీఆర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.ఈకార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఎనుగందుల రాజాపూర్ణానందం, మాజీ ఎంపీపీ కొలిప్యాక ఉపేం .దర్ రెడ్డి, బద్ధం శ్రీనివాస్ రెడ్డి, రాజారాం సహదేవ్, బద్ధం హన్మండ్లు, గన్నారపు రాజేశ్వర్, అట్ల పోశయ్య పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి:తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట చంద్రశేఖర్‌రావు పుట్టిన రోజు వేడుకలను కమ్మర్‌పల్లి మండల బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు.కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రేగుంట దేవేందర్, నాయకులు బద్దం చిన్నారెడ్డి, మైలారం సుధాకర్, పిప్పెర అనిల్, హల్దె శ్రీనివాస్, తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కోటగిరి: కోటగిరి మండల కేంద్రంలోని అమ్మ అనాథ ఆశ్రమంలో సోమవారం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలు బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఫారుఖ్, నవీన్, సమీర్ పాల్గొన్నారు,



ఏర్గట్లలో కేక్ కట్‌చేసిన బీఆర్ఎస్ నాయకులు

మోర్తాడ్: మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సోమవారం కేసీఆర్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కల్లెడ ఏలియా, పీఏసీఎస్‌చైర్మన్ బద్దం అశోక్‌రెడ్డి, మాజీసర్పంచ్ బోగ ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి:మండలకేంద్రంలో సోమవారం మాజీ సీఎం కేసీఆర్, నిజామాబాద్‌రూరల్ మాజీఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ నాయకులు కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు భోజన్న,నాయకులు పాల్గొన్నారు.

భీమ్‌గల్: మాజీసీఎం కేసీఆర్ 71వ జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సయ్య, మాజీఎంపీపీ, జడ్పీటీసీలు మహేష్, రవి, నాయకులు భగత్, లింబాద్రి, కార్యకర్తలు పాల్గొన్నారు.

మందిరంలో పోచారం పూజలు



వర్నిలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పోచారం

వర్ని,ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): వర్ని మండల కేంద్రంలోని సేవాలాల్ తండాలో సోమవారం బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి జగదాంబ మాత, సేవాలాల్ మహరాజ్ మందిర 10వ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బంజారాలు పాటలు పాడి నృత్యాలు చేశారు. ఈకార్యక్రమంలో బంజారా సేవా సమితి అధ్యక్షుడు బద్యా నాయక్, వెలగపూడి గోపాల్, నేమాని వీర్రాజు, ఆలయ కమిటీ చైర్మన్ పీర్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాన్ని పాఠకులు సద్వినియోగం చేసుకోవాలి

వేల్పూర్, ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండల కేంద్రంలో గ్రంథాలయాన్ని మండల, గ్రామాల పాఠకులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథపాలకురాలు శ్వేత కోరారు.ఈగ్రంథాలయంలో వివిధ రకాల ప్రభుత్వ ఉద్యోగుల కోసం ప్రిపరేషన్‌కు సంబంధించి అన్ని రకాల పుస్తకాలను అందుబాటులో ఉన్నాయన్నారు. గ్రంథాలయంలో అందుబాటులో లేని ఇతర పోటీ పరీక్షలకు సంబంధించి పుస్తకాలు పాఠకులు కోరితే జిల్లా గ్రంథాలయ శాఖ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, సెక్రెటరీ బుగ్గ రెడ్డిల ద్వారా పుస్తకాలను తెప్పించి పాఠకుల అందుబాటులో ఉంచడం జరుగుతుందని తెలిపారు. అంతేగాకుండా గ్రంథాలయంలో పాఠకుల కోసం వైఫై సౌకర్యం కల్పించడం జరిగిందన్నారు. పాఠకులు అన్ని సదుపాయాలు వేల్పూర్ గ్రంథాయానికి వచ్చి పోటీపరీక్షలకు సంబంధించి పుస్తకాలను చదువుతూ ఉద్యోగాన్ని సాధించాలని గ్రంథాలయ పాఠకురాలు స్వాతి కోరారు.

అత్మరక్షణకు కరాటే ఎంతో అవసరం

మెండోర, ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): ఆత్మరక్షణకు కరాటే ఎంతో దోహదపడుతుందని లిటిల్ ఫ్లవర్ హైస్కూల్ కరస్పాండెంట్ ఎండి.అజ్మత్‌పాషా అన్నారు. సోమవారం మండలంలో వెల్కటూర్ గ్రామంలో లిటిల్ ఫ్లవర్ హైస్కూల్ విద్యా ర్థులకు కరాటే బెల్టులు, ప్రశంసపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక అభ్యాసం నుంచి కరాటే నేర్చుకున్నట్టుతే శారీరక దృఢత్వం మానసిక ఉల్లాసంతో పాటు ఆకతాయిల నుంచి తమకు రక్షించుకోవచ్చని అన్నారు. ప్రతీ తల్లిదండ్రులు విద్యార్థులకు చిన్నప్పటి నుంచి కరాటే వంటి యుద్ధవిద్యనే నేర్పించాలని సూచించారు.ఈకార్యక్రమంలో కరాటే మాస్టర్ శివాణి, అవినాష్, రోషన్, విద్యార్థులు, తల్లిదండ్రులు, టీచర్లుపాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు ఇవ్వాలని ఇన్‌చార్జీ మంత్రికి వినతి



మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

నందిపేట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ జిల్లా పర్యటనలో ఉన్న ఇన్‌చార్జీ రాష్ట్రమంత్రి జూపల్లి కృష్ణారావుకు సోమవారం నందిపేట మండల అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ నిజామాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పెంట ఇంద్రుడు వినతి పత్రం అందజేశారు. 2024 నవంబర్‌లో జరిగిన ల్యాబ్ టెక్నీషియన్ సలితాలను వెంటనే విడుదల చేసి ఉత్తీర్ణులైన వారిని విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ నందిపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మంద మహిపాల్, ల్యాబ్ టెక్నీషియన్ నిరు ద్యోగులు రాష్ట్ర మంత్రి కృష్ణారావుకు వినతి పత్రం అందజేశారు. దీనికి స్పందిం చిన మంత్రి హెల్త్ చీఫ్ సెక్రెటరీకి ఫోన్లో మాట్లాడి ఆదేశాలు ఇచ్చారు. ఫలితాలు విడుదల చే యాలని సూచించారు. ఈ కార్యక్ర మంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ల్యాబ్ టెక్నీషియన్ నిరుద్యోగులు తధితరులు ఉన్నారు.

పడిగెలలో నీటి యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన



రైతు వేదికలో రైతులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రెడ్డీస్ సభ్యులు

వేల్పూర్, ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): మండలం పడిగెల గ్రామంలోని రైతు వేదికలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం వరి పంటలో నీటి యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు.వ్యవసాయ విస్తీర్ణాధికారి సాయిరాంరాజ్ మాట్లాడుతూ వరి పంట దిగుబడి కోసం పాటించాల్సిన పద్ధతులపై ఫౌండేషన్ వారు నిర్వహించే కార్యక్రమాలను రైతులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఫౌండేషన్ ప్రతినిధి చింత శ్రీనివాస్ మాట్లాడుతూ డీఎస్ఆర్ 18, తడిపొడి విధానం, డ్రమ్‌ఫీడర్ పద్ధతిపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ పద్ధతుల ద్వారా తక్కువ ఖర్చుతో ఆదాయం పెరగడంతో పాటు వరిసాగులో కూలీల కొరతను అధిగమించవచ్చన్నారు. వరి సాగులో నీటిని ఆదా చేసుకునే పద్ధతులను రైతులు అలవర్చుకోవాలని, వరిలో కలుపు తొలగించిన తర్వాత పొట్టవచ్చే సమయం వరకు ఎక్కువ నీరు అవసరం ఉండదని సూచించారు. 45తడులతో తడిపొడి విధానం పాటించి సాగు చేయవచ్చన్నారు. యాసంగి పంట చివరి వరకు పొలాలకు సాగునీరు అందించ వచ్చన్నారు. ఈ పద్ధతులను పాటిస్తే నీటి వృధాను అరికట్టడంతో పాటు వరి పంట నుంచి వెలువడే మిథేన్ వాయువు వల్ల కలిగే గ్లోబల్ వార్మింగ్‌ను తగ్గించి పర్యావరణ కాపాడవచ్చ న్నారు. అనంతరం ఏడబ్ల్యూడీ పైపులు అందజేశారు. వరి పంట కొయ్యాలను కాల్చవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో సాయిరాంరాజ్, ఫౌండేషన్ కమ్యూనిటీ కోఆర్డినేటర్ చింత శ్రీనివాస్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

ఎత్తొండ సొసైటీ బకాయిలపై సహకార బ్యాంకు నోటీసులు

- రూ.కోటి ముప్పై నాలుగు లక్షలు చెల్లించకపోతే భూమి వేలం
- ఆందోళనలో సంఘ సభ్యులు



ఎత్తొండ సహకార సంఘం


FORM NO.6

సహకార బ్యాంకు అధికారులు జారీచేసిన నోటీసు

కోటగిరి, ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): కోటగిరి మండలంలోని ఎత్తొండ ప్రాథమిక సహకార సంఘానికి రాజకీయ గ్రహణం పట్టుకుంది. గత ఐదేళ్ల కాలంలో సంఘంలో చోటు చేసుకున్న పరిణామాలు సంఘ ప్రతిష్టను మరింత దిగజారుస్తోంది. సంఘం ఇప్పటికే సుమారు తొమ్మిది కోట్ల రూపాయల నష్టాల భారిన పడగా కొత్తగా సహకార బ్యాంకు అధికారులు సంఘానికి నోటీసులు జారీ చేయడం ఆందోళన కలిగిస్తోంది. సహకార బ్యాంకు అధికారులు తమకు కోటి ముప్పై నాలుగు లక్షల పదివేల ఎనిమిది వందల అరవై రెండు రూపాయలు బకాయి చెల్లించాలని నోటీసులు జారీ చేశారు. సహకార శాఖ సెక్షన్ 70 ప్రకారం రూల్ 52ను అనుసరించి 10రోజుల్లో వడ్డీతో సహా చెల్లించాలని లేని పక్షంలో సంఘం తనఖా పెట్టిన భూమి సుమారు రెండున్నర ఎకరాల భూమిని వేలం వేస్తామని నోటీసులు అందించారు. సహకార బ్యాంకులో క్యాష్ క్రెడిట్ కింద సుమారు 3కోట్ల రూపాయలు గత పాలక వర్గం అప్పు తీసుకుంది. తీసుకున్న అప్పును ప్రస్తుత పాలక వర్గం కొంతమేర అప్పును వడ్డీతో సహా తీర్చింది. ప్రస్తుతం సుమారు 1,34,10,862 రూపాయల బకాయి ఉంది. సంఘం నిర్వహించిన పలు లావాదేవీల్లో వచ్చిన మొత్తాన్ని సహకార బ్యాంకులో జమ చేసిన వెంటనే బ్యాంకు అధికారులు తమ బకాయిల కింద జమ చేసుకుంటున్నారని పాలకవర్గ సభ్యులు తెలిపారు. సంఘానికి పెద్ద మొత్తంలో ఆస్తులు ఉన్నాయి. సంఘం ఆస్తుల ముందు అప్పు చిన్నదే అయినప్పటికీ కొందరు రాజకీయ స్వార్థంతో సంఘంపై అభాండాలు వేస్తూ సంఘ, పాలకవర్గ ప్రతిష్టను దిగజారుస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల సహకార సంఘంలో అవినీతి, అక్రమాలు చోటు చేసుకున్నాయని సెక్షన్ 51ప్రకారం విచారణ జరిపారు. సహకార సంఘం సివిల్ సప్లైకి సుమారు 40వేల క్వింటాళ్ళ బియ్యం ఇవ్వాల్సి ఉంది. దీని విలువ సుమారు 9కోట్లకు పైగా ఉంది. ఈ విషయమై ఇటీవల నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో విచారణ అధికారులు సభ్యులకు వివరించారు. ప్రస్తుత పాలకవర్గంతో పాటు కార్యదర్శిని బాధ్యులుగా చేస్తూ సుమారు ఒక్కొక్కరికి 50లక్షలకు పైగా కట్టాలని ఆదేశాలు జారీ చేశారు. తమ ప్రమేయం లేకుండానే తమని బాధ్యులు చేయడంపై పాలకవర్గ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. ఇదిఇలా ఉండగా సహకార బ్యాంకు అధికారులు కొత్తగా నోటీసులు జారీ చేసి ఆస్తులను వేలం వేస్తామని ప్రకటించడంపై సంఘ సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంఘంలో 2018 వరకు కొనసాగిన పాలక వర్గంలో సుమారు 7కోట్ల రూపాయల అప్పులు ఉన్నట్లు తెలిసింది. ప్రస్తుత పాలకవర్గం అప్పులను తీర్చే క్రమంలో చోటు చేసుకున్న రాజకీయ పరిణామాలు సంఘ ప్రతిష్టను దిగజారుస్తున్నాయి. సమగ్ర విచారణ జరిపాలని సంఘ సభ్యులు డిమండ్ చేస్తున్నారు.

'సీఎంను విమర్శించే నైతిక హక్కు ప్రశాంత్‌రెడ్డికి లేదు'



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

వేల్పూర్, ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డిపై విమర్శించే నైతిక హక్కు ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డికి లేదని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఇట్టెడి నర్సారెడ్డి అన్నారు. సోమవారం వేల్పూర్ మండలంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డికి అధికారం, ఆర్భాటలు లేకపోవడం వల్ల మతిభ్రమించి సీఎం రేవంత్‌రెడ్డిపై అనవసరమైన విమర్శలు చేయడం సరికాదన్నారు. రేవంత్‌రెడ్డి గురించి ఓటుకు నోటు విషయంలో ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి మాట్లాడడం నైతికహక్కు లేదన్నారు. ఇటీవల జరిగిన ఎమ్మెల్యే ఎన్నికలను బహిరంగంగా సుమారు రూ.50నుంచి రూ.100కోట్లు ఓటర్లకు పంచిపెట్టి చివరి క్షణాల్లో అతితక్కువ మెజారిటీతో గెలుపొందిన వేములప్రశాంత్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డిపై విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దామోదర్‌గౌడ్, బద్దం మహేందర్, రమేష్, అశోక్, సతీష్, సుమన్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

సబ్ స్టేషన్‌లలో బ్రేకర్లను ప్రారంభించిన ఎస్ఈ



బ్రేకర్‌ను స్విచ్ ఆన్ చేసి ప్రారంభిస్తున్న ఎస్ఈ రవీందర్

నవీపేట,ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): మండలంలోని నిజాంపూర్, నాళేశ్వర్‌లలోని 33/11సబ్ స్టేషన్‌లలో నూతనంగా ఏర్పాటు చేసిన బ్రేకర్లను సోమవారం ఎస్ఈ ఆర్. రవీందర్ ప్రారంభించారు. ఒక్కొక్క సబ్ స్టేషన్‌లో 17లక్షల రూపాయల వ్యయంతో ఈ బ్రేకర్లను ఏర్పాటు చేశారు. అలాగే 33/11జన్నేపల్లి సబ్ స్టేషన్ నుండి కమలాపూర్ సబ్ స్టేషన్ వరకు 40 లక్షల రూపాయల వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేసిన 33కేవీ లైన్‌ను సైతం ఆయనప్రారంభించారు.ఈకార్యక్రమంలో డీఈ శ్రీనివాస్, ఏడీఈ ప్రశాంత్ రెడ్డి, ఏఈ శ్రీనివాస్, ఆయా గ్రామాల వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌లో రైతుల నిరాహార దీక్ష



ఆర్మూర్‌లో రిలే నిరాహార దీక్షలో కూర్చున్న రైతులు

ఆర్మూర్‌రూరల్, ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన పంట పసుపునకు క్వింటాలుకు రూ.17వేల మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ సోమవారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో రైతులు నిరాహర దీక్ష చేపట్టారు. కొమ్ముల వినోద్‌రెడ్డి, నక్కల రాములు, నారాయణపేట్ ముత్యంరెడ్డితో పాటు పలువురు రైతులు రిలే నిరాహర దీక్షలో కూర్చున్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ దీక్షను పసుపు పంటకు మద్దతు ప్రకటించి రైతులను ఆదుకునే వరకు కొనసాగిస్తామని వారు స్పష్టం చేశారు. పసుపు పండించేందుకు పెట్టుబడులు ఎక్కువై రైతులకు గిట్టుబాటు ధర రావడంలేదన్నారు. ప్రస్తుతం క్వింటాలుకు రూ9 నుంచి రూ.10వేల ధర ఉందని, దీంతో రైతులకు నష్టాలే మిగులుతాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో పోశయ్య, ఫత్తేపూర్ గంగారెడ్డి, దేవేందర్‌రెడ్డి, రాజారెడ్డి, సాయిరెడ్డి పాల్గొన్నారు.

కాకతీయ కాలువలో పడి ఒకరి మృతి

ముప్కాల్, ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): కాకతీయ కాలువలో పంప్ సెట్లు నాచు తొలగించడానికి కాలువలో దిగి కోమరశెట్టి చిన్నయ్య (47) మృతి చెందిన సంఘటన ముప్కాల్ మండలం రెంజర్ల గ్రామంలో చోటు చేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించిన ఎస్సై రజనీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం ముప్కాల్ మండలం రెంజర్ల గ్రామశివారులో గల కాకతీయ కాలువలో పంట పొలాలు పారించుకునేందుకు కాకతీయ కాలువలో పెట్టుకున్న మోటర్ ఫుట్‌బాల్‌కు చుట్టు ఉన్న నాచును తీయడానికి కాలువలో దిగి చిన్నయ్య ప్రమాదవశాత్తు నీటి వేగానికి కొట్టుకుపోయి మృతి చెందినట్టు ఎస్సై తెలిపారు. మృతుని కుమారుడు శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

ముస్సిపల్ పరిధిలో మాస్టర్ ప్లాన్ సర్వే ప్రారంభం



డ్రోన్ సహకారంతో మాస్టర్ ప్లాన్‌ను ప్రారంభిస్తున్న మున్సిపల్ కమిషనర్

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలో మాస్టర్ ప్లాన్ సర్వేను సోమవారం మున్సిపల్ కమిషనర్ రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమృత్ 2.0 బృహత్ ప్రణాళిక పథకంలో భాగంగా సర్వే ఆఫ్‌ఇండియా రాష్ట్రవ్యాప్తంగా 50వేల నుంచి లక్షలోపు జనభా కలిగిన 20 పట్టణాలను అభివృద్ధి చేసేందుకు ఎంపిక చేసిందని, అందులో భాగంగా మున్సి పల్‌లో డ్రోన్ సహకారంతో 36వార్డులకు సుమారు 11వేల350ఎకరాల్లో విస్తరించి ఉన్న ప్రతీ అంశాన్ని మాస్టర్ ప్లాన్‌లో వచ్చిందని, దాని ఆదారంగా అభివృద్ధి చెందు తుందని ఆయన అన్నారు.12రోజులలో సర్వేనుపూర్తి చేసి మాస్టర్‌ప్లాన్‌ను రూ పొందించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నివేదికను రూపొందిస్తామని ఆయన తెలిపారు.

బట్టాపూర్‌లో క్రికెట్ పోటీలు ప్రారంభం

ఏర్గట్ల,ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని బట్టాపూర్ గ్రామంలో సోమవారం స్థానిక యువకుల ఆధ్వర్యంలో మండల స్థాయి క్రికెట్ పోటీలను మూడ్ దయానంద్ ప్రారంభించారు. ఈపోటీల్లో పాల్గొనే జట్లు వెయ్యిరూపాయలు చెల్లించి పోటీల్లో పాల్గొనాలని, గెలిచిన మొదటి జట్టుకు పది వేలు, ద్వితియ బహుమతి ఐదువేలతో పాటు విజేతలకు బహుమతలు అందజేస్తామని, జట్లనమోదుకై 8185035654,8179523239,703673505లకు సంప్రదించాలన్నారు.

అర్గుల్‌లో ఘనంగా వేంకటేశ్వరస్వామి రథోత్సవం

జక్రాన్‌పల్లి, ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): మండలంలోని అర్గుల్ గ్రామంలో సోమవారం రాత్రి శ్రీ వెంకటేశ్వరస్వామి రథోత్సవం అంగరంగా వైభవంగా జరిగింది. ఈ రథోత్సవంలో నిజామాబాద్‌రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో వీడీసీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, క్యాషియర్ అల్లూరి బాస్కర్‌రెడ్డి, తాజామాజీసర్పంచ్ గోర్త పద్మరాజేందర్, తాజామాజీ ఎంపీటీసీ జైడి అనిత చిన్నారెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిన్నారెడ్డి, వీడీసీసభ్యులు, భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన రూరల్ సింగిల్‌విండోల చైర్మన్లు

జక్రాన్‌పల్లి, ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి):నిజామాబాద్‌రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డిని సోమవారం నిజామాబాద్‌రూరల్ సింగిల్‌విండోల చైర్మన్‌లు కలిశారు. అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డిని శాలువ, మెమొంటోతో సన్మానించారు. సింగిల్‌విండోల పదవి కాలాన్ని మరో ఆరు నెలలు పొడిగించడం పట్ల నిజామాబాద్‌రూరల్‌లోని వివిధ గ్రామాల సింగిల్‌విండోల చైర్మన్‌లు హర్షం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, నిజామాబాద్‌రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డికి సింగిల్‌విండో చైర్మన్‌లు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్గుల్, కొలిప్యాక్, బ్రహ్మణ్‌పల్లి సింగిల్‌విండో చైర్మన్‌లు ఆర్మూర్ గంగారెడ్డి, నాగుల శ్రీనివాస్, కాట్‌పల్లి నర్సారెడ్డి, రూరల్ నియోజకవర్గంలో గ్రామాల సింగిల్‌విండోల చైర్మన్‌లు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే భూపతిరెడ్డిని కలిసిన వివిధ గ్రామాల సింగిల్ విండోల చైర్మన్లు

తిమ్మాపూర్‌లో బైక్ ప్రమాదంలో ఇద్దరి మృతి



సొహెల్(ఫైల్) సుమేర్(ఫైల్)

మోర్తాడ్, ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): అతివేగం ఇద్దరి ప్రాణాలను బలిగొంది. ఈ సంఘటన మోర్తాడ్ మండలం తిమ్మాపూర్ గ్రామంలో జరిగింది. తిమ్మాపూర్ గ్రామానికి చెందినమ మమహ్మద్ సొహెల్(29), ఆయన బంధువు మహమ్మద్ సుమేర్(19) యువకులు గ్రామంలో రాయలెండ్ ఫీల్డ్ వాహనంపై మద్యం తాగి అతివేగంగా వెళ్తూ గ్రామంలోనే టెలి ఫోన్ స్తంభానికి ఢీకొట్టడం తో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ సంఘటన సోమవారం మధ్యాహ్నం జరిగింది. మహమ్మద్ సొహెల్ పాత ఇంటి నుంచి కొత్త ఇంటికి వెళ్తుండగా మార్గమధ్యంలో ఆజాగ్రత్తగా నడపడంతో ఈ సంఘ టన జరిగిందని భీమ్‌గల్ సీఐ సత్యనారాయణగౌడ్ తెలిపారు. విషయం తెలి సిన వెంటనే ఎస్సై విక్రం,భీమ్‌గల్ సీఐ సత్యనారాయణగౌడ్ సంఘటన స్థలా నికి చేరుకొని వివరాలు సేకరించారు. అప్పటికే తీవ్రగాయాలైన వారిని బతుకుతననే ఆశతో ఆర్మూర్ ఆసుపత్రికి తరలించగా మృతి చెందినట్టు వైద్యు లు తెలిపారని సీఐ తెలిపారు. సొహెల్ భార్య మహ మ్మద్ రజీయా ఇచ్చిన ఫిర్యాదు మేరకు మృతదేహాలను పోస్టుమార్టం నిర్వ హించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. మృతుడు సొహెల్‌కు భార్య, రెండేళ్ల కూతు రు ఉంది. సుమేర్ మెట్‌పల్లి మండలం యుసుబ్ నగర్‌కు చెందినవాడని అని తెలిపారు. ఈసంఘటన గ్రామంలో గ్రామస్థులను తీవ్రంగా కలిచివేసింది.

విద్యార్థులు మంచి పోషకాహారాన్ని తీసుకోవాలి

- డీఎంఅండ్‌హెచ్‌వో రాజశ్రీ



విద్యార్థులకు కంటి పరీక్షలను ప్రారంభిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌వో రాజశ్రీ

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మంచి పోషకాహారాన్ని తీసుకోవాలని డీఎంఅండ్‌హెచ్‌వో రాజశ్రీ అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలో విద్యానభ్యాసిస్తున్న విద్యార్థినులను కంటి పరీక్షలను ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జిల్లాలోని జీజీహెచ్ ఆర్మూర్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్నామని అన్నారు. గతంలో ఆర్‌డీఎస్‌లో భాగంగా ప్రభుత్వ పాఠశాల హాస్టళ్లలో ఉంటున్న సుమారు 90వేల మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించగా 5300మంది విద్యార్థులకు కంటి సమస్యలు వచ్చాయని, వారికి కంటి అద్దాలు అందించడంలో జాప్యం జరిగిందని, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 28వ తేదీ వరకు కంటి పరీక్షలు నిర్వహించి కంటి అద్దాలు పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ రమేష్, ఆసుపత్రి సూపరిండెంట్ రవికుమార్, ఆర్ఎంఓ అమృత్‌రాంరెడ్డి, డాక్టర్ అజయ్, డాక్టర్ స్నేహ, డాక్టర్ భుజంగరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఫటా..ఫట్...

పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

● గంగామణి, ప్రత్యేక అధికారిణి, కస్తూర్బా పాఠశాల, ఆర్మూర్



ఆంధ్రజ్యోతి: కస్తూర్బా పాఠశాలలో ఎంత మంది విద్యార్థినులు ఉన్నారు?

ప్రత్యేక అధికారిణి: మొత్తం 316 మంది విద్యార్థినులు ఉన్నారు. ఇందులో పాఠశాలలో 205, ఇంటర్ విద్యార్థినులు 111మంది ఉన్నారు.

ఆంధ్రజ్యోతి: విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారా?

ప్రత్యేక అధికారిణి: పదో తరగతి, ఇంటర్ విద్యార్థినులకు ఉదయం గంట పాటు, సాయంత్రం గంట పాటు అదనంగా తరగతులు నిర్వహిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: విద్యార్థినులకు ప్రభుత్వం నుంచి అన్ని సౌకర్యాలు అందుతున్నాయా?

ప్రత్యేక అధికారిణి: విద్యార్థినులకు పుస్తకాలు, యూనిఫాం, రికార్డు బుక్స్, ఉలాన్ బ్లాంకెట్లు అందజేశాం.

ఆంధ్రజ్యోతి: పాఠశాలలో సమస్యలు ఉన్నాయా?

ప్రత్యేక అధికారిణి: పాఠశాల ప్రహరీ కొంత మేరకు కూలిపోయి ఉంది. దానిని నిర్మించాల్సి ఉంది. అధికారులకు విన్నవించాం. అదే విధంగా మైదానంలో మొరం వేయాల్సి ఉంది.

ఆంధ్రజ్యోతి: విద్యార్థినులకు క్రీడల్లో శిక్షణ ఇస్తున్నారా?

ప్రత్యేక అధికారిణి: విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహిస్తున్నాం. ఇటీవల జరిగిన అథ్లెటిక్స్ అండర్-16 విభాగంలో ఆర్మూర్ పాఠశాలకు చాంపియన్‌షిప్ లభించింది.

●(ఆంధ్రజ్యోతి,ఆర్మూర్‌రూరల్)

పాలెం విద్యార్థుల క్షేత్ర సందర్శన

మోర్తాడ్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): పాలెం గ్రామానికి చెందిన విద్యార్థులు, ఉపాధ్యాయులు ధోన్‌పాల్ పాఠశాలకు క్షేత్ర సందర్శనకు వెళ్ళారు. ఉన్నత పాఠశాలలో బోధన విధానం, డిజిటల్ బోధన గురించి విద్యార్థులు వీక్షించారు. పాఠశాలలోని గ్రంథాలయం, సైన్స్ ల్యాబోరేటరి, కిచెన్ గార్డెన్, తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం గ్రామంలోని వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించారు.

ఫంక్షన్ హాళ్లపై పట్టింపేదీ..!?

● కనిపించని సీసీ కెమెరాలు ● ఒకేరోజు రెండు పెళ్లిళ్లు ● ఫైర్ సేఫ్టీ పరికరాలు కరువు
● శానిటేషన్ విభాగానికి అదనపు భారం ● నిబంధనలు పాటించని యజమానులు ● పట్టించుకోని జిల్లా అధికారులు

బోధన్‌రూరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మాఘ మాసం మొదలై పెళ్లిళ్ల సీజన్‌తో ఫంక్షన్ హాళ్లు కిటకిటలాడుతున్నాయి. పట్టణంలోని ప్రధాన ఫంక్షన్ హాల్‌లో రెండు శుభకార్యాలు జరుగుతున్నాయి. ఉదయం వివాహం, సాయంత్రం డిన్నర్ వంటి కార్యక్రమాలతో ఫంక్షన్ హాళ్లు బిజీ బిజీగా మారాయి. కాని ఫంక్షన్ హాళ్లపై పర్యవేక్షణ కరువైంది. ఫంక్షన్ హాల్ నిర్వాహకులు ప్రభుత్వ నియమ, నిబంధనలు పాటించడం లేదు. జిల్లాలో సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బోధన్ డివిజన్‌తో పాటు జిల్లాలోని ఫంక్షన్ హాళ్లలో సంబంధిత అధికారుల నిఘా కరువైంది. నిత్యం పెళ్లిళ్లు, పుట్టిన రోజు ఇతరత్రా వేడుకలు నిర్వహించుకునే ఫంక్షన్ హాళ్లలో సీసీ కెమెరాలు లేకపోవడం, శుభకార్యాలయాలకు వచ్చే వారికి ఇబ్బందులకు గురి చేస్తుంది. సీసీ కెమెరాలు లేకపోవడం సందట్లో సడేమియా అంటూ దొంగలకు కలిసి వస్తుంది. పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాల సందర్భంగా వందల సంఖ్యలో గుమిగూడి ఉండే ఫంక్షన్ హాళ్లలో సీసీ కెమెరాలు లేకపోవడం గమనార్హం. ఫంక్షన్ హాల్‌లో సీసీ కెమెరాల ఏర్పాట్లపై అటు పోలీసులు, ఇటు అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయం.

● నిఘాతో అడ్డుకట్ట

సీసీ కెమెరాలు ఉంటే శుభకార్యాలు చేసుకునే వారికి అన్ని విధాలుగా సౌకర్యంగా ఉంటుంది. ఫంక్షన్ హాళ్లకు వచ్చే మహిళల బంగారు ఆభరణాల చోరీ ఘటనలు జరిగే అవకాశాలు ఉండవు.

● ఫైర్‌సేఫ్టీ అనుమతులు కరువు

ఫంక్షన్ హాల్ నిర్మాణాలకు గ్రామీణ ప్రాంతాలలో జిల్లా పంచాయతీ అధికారి, మున్సిపల్ పరిధిలో కమిషనర్ అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. వీరితో పాటు అగ్నిమాపక శాఖ నుంచి తప్పనిసరిగా ఫైర్‌సేఫ్టీ అనుమతి ఉండాలి. ఫంక్షన్ హాల్ నిర్మాణ సమయంలో ముందస్తుగా ప్రొవిజినల్ ఎన్‌వోసీ తీసుకోవాల్సి ఉంటుంది. నిర్మాణం పూర్తయిన తర్వాత ఒరిజినల్ ఫైర్‌సేఫ్టీ అనుమతి తీసుకోవాలి. ఫంక్షన్ హాల్స్‌లో అగ్నిమాపక నియంత్రణ పరికరాలు అందుబాటులో ఉంచితేనే ఫైర్‌సెఫ్టీ అనుమతి ఇస్తారు. కాని జిల్లాలో సుమారు 50 వరకు ఫంక్షన్ హాళ్లు ఉండగా కేవలం కొన్నింటికి మాత్రమే ప్రొవిజినల్ ఎన్‌వోసీ ఉన్నట్లు అధికారులు తెలుపుతున్నారు. ఐదేళ్లకు ముందు నిర్మించిన వాటికి అనుమతులు లేవని ఐదేళ్ల నుంచే ఈ అనుమతులు తీసుకుంటున్నారని అధికారులు పేర్కొంటున్నారు. శుభకార్యాలు జరిగినప్పుడు భోజన విస్తరాకులు, ఇతర వ్యర్థాలు మున్సిపల్ శానిటేషన్ విభాగానికి తీసుకెళ్లడం అదనపు భారంగా మారింది. నిత్యం పెళ్లిళ్ల సీజన్‌లో రెండు పెళ్లిళ్లు జరిగే సరికి ఫంక్షన్ హాల్‌లోని చెత్తాచెదారం తీసుకెళ్లడం వారికి భారంగా మారింది.



బోధన్‌లోని ఫంక్షన్ హాల్ దృశ్యం

పర్యావరణాన్ని పరిరక్షించాలి

● వెంకట నారాయణ, మున్సిపల్ కమిషనర్, బోధన్



ఫంక్షన్ హాల్‌లో పర్యావరణాన్ని పరిరక్షించడానికి యజమాన్యాలు కృషి చేయాలన్నారు. ప్లాస్టిక్‌లను వాడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. లేని యెడల కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్లి చర్యలు చేపడతామన్నారు.

ఇందిరమ్మ ఆత్మీయ భరోసాతో
ఈజీఎస్ పనులపై కూలీల ఆసక్తి


ఉపాధి పనుల్లో కూలీలు


ఉపాధి కూలీలుగా పనిచేస్తున్న వ్యవసాయ కూలీలు

మద్నూర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మఆత్మీయ భరోసా పథకం ఉపాధి హామీ పథకం పనులకు అనుసంధానం చేయడంతో ఈసారిఎక్కువ మంది పనుల్లో పాల్గొనే అవకాశం కనిపిస్తుంది. ఈజీ ఎస్ కార్యాలయానికి కూలీలు తరలివచ్చి కొత్తగా జాబ్ కార్డుకావాలంటూ కోరుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. కొత్త ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ 1వ తేదీ నుంచి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులు ప్రారంభం కాబోతున్నాయి. ఇందుకు సంబంధించిన జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులు చేపట్టబోయే పనులకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. అయితే గతంలో కంటే ఈసారి భిన్నంగా ఈజీఎస్ పనులకు డిమాండ్ రాబోతున్నట్లు తెలుస్తుంది. కామారెడ్డి జిల్లాలో 2.50222 లక్షల మంది జాబ్ కార్డులు తీసుకోగా అందులో 1.25001 మంది మాత్రమే ఉపాధి పథంలో పాల్గొంటున్నారు. అయితే ఈ సారి రాష్ట్ర ప్రభుత్వం భూమిలేని వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం ప్రవేశపెట్టి ప్రతి సంవత్సరం రూ.12 వేల చొప్పున మంజూరు పథకానికి శ్రీకారం చుట్టింది. ఏడాదిలో రెండు సార్లు రూ.6 వేల చొప్పున రూ.12 వేలు అందించనున్నారు. కనీసం ఏడాదిలో 20 రోజులుగా ఉపాధి పనుల్లో పాల్గొని ఉండాలని నిబంధనలు విధించడంతో కొద్ది మందికి మాత్రమే అర్హత లభించింది. ఈసారి ఉపాధి పనుల్లో పాల్గొనే పరిస్థితి కనిపిస్తుంది.

● కొత్త జాబ్ కార్డులపై వెలువడని నిర్ణయం

రాష్ట్ర ప్రభుత్వం కొత్త జాబ్ కార్డులకు ఇంకా అనుమతి ఇవ్వలేదు. ప్రస్తుతం పాత కార్డులు ఉన్న వారికి ఉపాధి పనులు నడుస్తున్నాయి. ఈజీఎస్ కార్యాలయానికి కూలీలు జాబ్ కార్డు కావాలంటూ తరలివస్తున్నారు. ముందుగా గ్రామ పంచాయితీలో దరఖాస్తు చేసుకోవాలని గ్రామ పంచాయితీ వారు దరఖాస్తు చేసుకున్న వారి వివరాలు సేకరించి వారు పనికి అర్హులేనా కాదా? అన్న తరువాతనే ఈజీఎస్ కార్యాలయానికి నివేదిక పంపించిన తరువాతే వారికి జాబ్ కార్డులు ఇవ్వనున్నట్లు తెలుస్తుంది.

చురుగ్గా కొనసాగుతున్న రైల్వే డబ్లింగ్ పనులు

● 2026లోగా పనులు పూర్తి చేయాలని లక్ష్యం

ఆంధ్రజ్యోతి పరిశీలన


నవీపేట రైల్వే స్టేషన్


నవీపేట రైల్వే స్టేషన్ ఆవరణలో కొనసాగుతున్న పనులు


నవీపేట శివారులో డబ్లింగ్ కోసం ఎర్త్ పనులు చేపట్టిన దృశ్యం

నవీపేట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వేలోని మేడ్చల్ నుంచి మహారాష్ట్రలోని ముఖేడ్ వరకు రైల్వే డబ్లింగ్ పనులు మంజూరు కాగా మండలంలోని మహంతం రైల్వే గేటు నుండి బాసర వరకు పనులు చురుకుగా కొనసాగుతున్నాయి. దీనికి సంబంధించి గత కొంత కాలంగా భూమి చదును పనులు పూర్తి చేయగా ప్రస్తుతం ఎర్త్ పనులు కొనసాగుతున్నాయి. సికింద్రాబాద్ నుండి ముంబాయి వెళ్లే ఈ రైలు మార్గంలో రైల్వే డబ్లింగ్ లేకపోవడంతో పలు ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లతో పాటు సరుకు రవాణా రైళ్లు సకాలంలో గమ్యానికి చేరుకోలేక పోతున్నాయి. డబ్లింగ్ పనులు పూర్తయితే ఇరువైపుల నుండి వచ్చే రైళ్లకు క్రాసింగ్ బెడద తొలగిపోనుంది. దీనికి సంబంధించి నవీపేట రైల్వే స్టేషన్‌లో 2వ ప్లాట్ ఫామ్ ఏర్పాటుతో పాటు ఫకీరాబాద్ స్టేషన్‌లో రైల్వే ప్లాట్‌ఫామ్ నిర్మాణ పనులు సైతం చేపట్టనున్నారు. డబ్లింగ్ పనులకు సంబంధించి పలు చోట్ల భూసేకరణ అవసరం ఉందని రెవెన్యూ అధికారులు సహకరిస్తే పనులు మరింత వేగంగా కొనసాగే అవకాశాలు ఉన్నాయని రైల్వే అధికారులు పేర్కొన్నారు. 2026లోగా డబ్లింగ్ పనులు పూర్తి చేయాలనే లక్ష్యంతో పనులు కొనసాగిస్తున్నట్లు రైల్వే అధికారులు పేర్కొన్నారు.

ఘనంగా శివస్వాముల ఊరేగింపు


దోమకొండలో శావ నిర్వహిస్తున్న శివ స్వాములు

దోమకొండ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సోమవారం సాయంత్రం శివస్వాములు శావ ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. చాముండేశ్వరీ ఆలయం, పాత బస్టాండ్, కొత్త బస్టాండ్, అంగడి బజార్, బురుజు మీదుగా శావను ఊరేగించారు.కార్యక్రమంలో శివ స్వాములు, శివ భక్తులు పాల్గొన్నారు.

మహా కుంభాభిషేక వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే



ఆశీర్వాదం తీసుకుంటున్న దృశ్యం

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మహా కుంభాభిషేక ప్రథమ వార్షికోత్సవంలో ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారా యణ పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలోని కిసాన్‌గంజ్‌లో గల పట్టణ ఆర్యవైశ్య సంఘంలో జరిగిన మహా కుంభాభిషేక కార్యక్రమంలో పాల్గొని పీఠాధిపతి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ కార్యక్ర మానికి వైశ్య పీఠాధిపతి హళ దీపుర వామనాశ్రమ మహా స్వా మి మంగళ శాసనములతో మహా కుంభాభిషేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్లు పార్శి ఆత్మారాం గుప్త, పెద్ది రాజేందర్‌గుప్త, పెండ్యాల శ్రీనివాస్‌గుప్త, పాల్తి రవికుమార్ గుప్త, పారిశ్ర రాఘవేందర్‌గుప్త, ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు ఇల్లెందుల ప్రభాకర్‌గుప్త, భక్తులు పాల్గొన్నారు.

ఎంపీ అర్వింద్‌ను సన్మానించిన అర్బన్ ఎమ్మెల్యే

నిజామాబాద్ పార్లమెంట్ సభ్యుడు ధర్మపురి అర్వింద్‌ను నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్య నారాయణ ఘనంగా సన్మానించారు. జిల్లా కేంద్రంలోని ఎంపీ నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి శాలువా, బొకేతో ఘనంగా సన్మానించారు. నిజామాబాద్ జిల్లాకు పసుపు బోర్డు సాధించిన అనంతరం మొదటిసారిగా నగరానికి వచ్చిన సందర్భంగా ఎంపీని కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు లక్ష్మీనారాయణ, పవన్, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంకాలమ్మ, పోలేరమ్మ ఆలయ వార్షికోత్సవ వేడుకలు


కమలాపూర్ అంకాలమ్మ, పోలేరమ్మ ఆలయంలో లక్ష పుష్పార్చన నిర్వహిస్తున్న మహిళలు


చండీయాగం నిర్వహిస్తున్న దృశ్యం

నవీపేట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కమలాపూర్‌లోని శ్రీ అంకాలమ్మ, పోలేరమ్మ ఆలయంలో సోమవారం వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ 5వ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకం, చండీయాగం, సామూహిక లక్ష పుష్పార్చన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

ఎర్రజొన్న వ్యాపారుల సిండికేట్

● రైతులను నట్టేట ముంచే ప్రయత్నాలు
● ఎర్రజొన్న సాగు విస్తీర్ణం తగ్గినా పెరగని ధర

ఆర్మూర్‌రూరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ ప్రాంత ప్రధాన వాణిజ్య పంట అయిన ఎర్రజొన్నలు, తెల్లజొన్నల ధర తగ్గించేందుకు విత్తన వ్యాపారులు రంగం సిద్ధం చేసుకున్నారు. సిండికేట్‌గా మారి రైతులను నిలువున ముంచే ప్రయత్నాలు జరుగుతున్నాయని సమాచారం. గత సంవత్సరం ఎర్రజొన్న క్వింటాలుకు రూ.4వేలతో ప్రారంభమై రూ.3600 వద్ద స్థిరంగా ఉంది. తెల్లజొన్నలకు సైతం ధర బాగానే పలికింది. విత్తన వ్యాపారులు ఇటీవల గుజరాత్‌లో సమావేశమై సిండికేట్‌గా మారారని ఆర్మూర్ ప్రాంతంలో ప్రచారం జరుగుతోంది.

తగ్గిన ఎర్రజొన్న సాగు విస్తీర్ణం

ఆర్మూర్ సబ్‌డివిజన్ గ్రామాల్లో గతంతో పోలిస్తే ఈ సారి ఎర్రజొన్న పంట సాగు గణనీయంగా తగ్గింది. ఎర్రజొన్న సాగు చేసిన రైతులు మొక్కజొన్న వైపు మళ్ళడంతో విస్తీర్ణం తగ్గింది. హైబ్రిడ్ మొక్కజొన్న, సీడ్ మొక్కజొన్నకు డబ్బులు ఎక్కువగా వస్తుండడంతో రైతులు మొక్కజొన్న సాగు చేస్తున్నారు. గతంలో ఆర్మూర్ మండలంలో సుమారు ఎనిమిది వేల ఎకరాలలో జొన్న పంట సాగు చేయగా ప్రస్తుతం 5500 ఎకరాలకు పరిమితమైంది. గతంలో డివిజన్ స్థాయిలో సుమారు 45వేల ఎకరాల్లో ఎర్రజొన్న పంట సాగయ్యేది. ప్రస్తుతం 32వేల294 ఎకరాల్లో ప్రస్తుతం సాగవుతుంది. వివిధ మండలాల్లో ఎర్రజొన్నకు ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న సాగు చేయడంతో విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. దీంతో ఎర్రజొన్న విస్తీర్ణం తగ్గడంతో ఈయేడు ఎర్రజొన్నలకు క్వింటాలుకు రూ.4వేలకు పైగా ధర వస్తుందని రైతులు ఆశించారు. విత్తన వ్యాపారుల మాయ జాలంతో ధర వచ్చే అవకాశం కనిపించడం లేదు. ఎర్రజొన్న క్వింటాలుకు రూ.3700, తెల్లజొన్న క్వింటాలుకు రూ.3000 చెల్లించాలని నిర్ణయించినట్టు తెలిసింది.


ఆర్మూర్ ప్రాంతంలో సాగవుతున్న ఎర్రజొన్న పంట


ఆరబోసిన ఎర్రజొన్నలు

అధికారుల ఆదేశాలు బేఖాతరు

ఎర్రజొన్న వ్యాపారులు అధికారుల ఆదేశాలు పట్టించుకోవడంలేదు. పంట విత్తడానికి ముందే గత సెప్టెంబర్ 26వ తేదీన జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు రైతులు, లైసెన్స్ కలిగిన విత్తన వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. వ్యాపారులు సీడ్ ఇచ్చే ముందు బైబ్యాక్ ఒప్పందం చేసుకోవాలని అధికారులు వ్యాపారులకు, రైతులకు సూచించారు. రైతులను మోసం చేయడానికి పక్క ప్రణాళికతో ఉన్న వ్యాపారులు అధికారులు బైబ్యాక్ ఒప్పందం చేసుకోవాలన్న అధికారుల ఆదేశాలను పట్టించుకోవడంలేదు. తాజాగా సిండికేట్‌గా మారి ధరలు తగ్గించేందుకు ప్రయత్నాలు చేస్తుండడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలి

● కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్



కరీంనగర్‌లో బీజేపీ మండల అధ్యక్షుల సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

భగత్‌నగర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. సోమవారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలులో ఎమ్మెల్సీ నియోజకవర్గం పరిధిలోని బీజేపీ మండల అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా నియామకమైన బీజేపీ మండలాధ్యక్షులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో సత్తా చూపించాలన్నారు. మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో బీజేపీ అభ్యర్థులు గెలవడం ఖాయమన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల పక్షాన పోరాటం చేసిన పార్టీగా ఒక్క బీజేపీకే ఓట్లు అడిగే హక్కు ఉందన్నారు. మేధావులు ఆలోచించి బీజేపీని ఎమ్మెల్సీ ఎన్నిక ల్లో గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో ఎంపీలు రఘునందన్‌రావు, జి.నగేష్, ఎమ్మెల్యేలు కాటేపల్లి వెంకటరమణా రెడ్డి, పాయల శంకర్, పాల్వాయి హరీష్ బాబు, మాజీ ఎమ్మెల్యేలు ఎన్వీఎస్ ఎస్ ప్రభాకర్, చింతల రాంచంద్రారెడ్డి, బొడిగె శోభ, పార్టీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, మాజీ మేయర్లు సునీల్ రావు, డి.శంకర్, ఎమ్మెల్సీ అభ్యర్థులు అంజిరెడ్డి, మల్క కొమురయ్య పాల్గొన్నారు.

ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు


కామారెడ్డిలో కేక్‌కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే గంపగోవర్ధన్


మహ్మాద్‌నగర్‌లో..


పెద్దకొడప్‌గల్‌లో..


ఎల్లారెడ్డిలో కేసీఆర్ జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే సురేందర్

కామారెడ్డిటౌన్,ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రంలో సోమవారం మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే గంపగోవర్ధన్ తన ఇంటివద్ద భారీ కేక్‌నుకట్‌చేసి నాయకులకు, కార్యకర్తలకు తినిపించారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ కోసం పోరాడి సాధించడంతో పాటు 10సంవత్సరాలు ప్రజలకు సంక్షేమంతో కూడిన పాలనను అందించిన మహోన్నత వ్యక్తి కేసీఆర్ అని అన్నారు.కళ్యాణలక్ష్మీ,షాదిముబారక్ లాంటి పథకాలు తీసుకువచ్చి పేదింటి బిడ్డల పెళ్లికి ఇబ్బందులు లేకుండా చూడడంతో పాటు రైతులను, మహిళలను, వృద్దులకు ఎన్నో రకాలు పథకాలు అమలుచేసి ఆదుకున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, నాయకులు హఫీజ్, రవి, పిట్ల వేణు,గెరిగంటి లక్ష్మీనారాయణ,శ్రీనివాస్‌గౌడ్,మాసుల లక్ష్మీనారాయణ,నజిరొద్దిన్,బలవంతరావు,భానుప్రసాద్ పాల్గొన్నారు.

పెద్ద కొడప్‌గల్: తెలం గాణ రాష్ట్ర మాజీ సిఎం, టిఆర్ఎస్ పార్టీ వ్యవస్థాప కులు కేసిఆర్ జన్మదిన వే డుకలను పెద్ద కొడప్‌గల్ మండల కేంద్రంలో బీఆర్ ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయ ఆవరణలో కేసీఆర్ జన్మదినం సందర్బంగా కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు.ఈకార్యక్రమంలో మాజీ ఎంపిపి ప్రతాప్ రెడ్డి, సహకార సంఘం అధ్యక్షులు హన్మంత్ రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నిజాంసాగర్: మాజీ సీఎం బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర రావు 71వ జయంతి వేడుకలు సోమవారం ఊరు రా టిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. నిజాంసాగర్ మహ్మాద్‌నగర్ మండల కేంద్రాల్లో ఉన్న టిఆర్ఎస్ కార్యాలయాల వద్ద తెరాస నాయకులు కేసీఆర్ జన్మదిన కేకులను కట్ చేసి ఘనంగా నిర్వహించారు. నాయకులు కార్యకర్తలు కేకులు ఒకరికొకరు తినిపించుకున్నారు. మహమ్మద్ నగర్ మండల కేంద్రంలో కేసీఆర్ జయంతిని పురస్కరించుకొని మొక్కలను జుక్కల్ మాజీ ఎమ్మెల్యే షిండే మాజీ జిల్లా జిల్లా పరిషత్ చైర్మన్ మొక్కలను నాటారు ఈ సందర్భంగా జుక్కల్ మాజీ ఎమ్మెల్యే షిండే మాట్లాడుతూ కల్వకుంట్ల చంద్రశేఖర రావు రాష్ట్రానికి ఎన్నో సేవలు చేసి పేదల పాలిట ఓ దేవుడిలా నిలిచారని గుర్తు చేశారు. ఉమ్మడి మండలాల్లో మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు జన్మదిన టిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు జరపడం ఎంతో ఆనందకరమని ఆయన అన్నారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర రావు నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో జీవించి బంగారు తెలంగాణకు మరొకసారి ముఖ్యమంత్రి కావాలని కొనియాడారు. ఈ ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ డి రాజు, మాజీ ఎంపీపీ జ్యోతి దుర్గారెడ్డి, వింఢో అధ్యక్షులు విట్టల్ రెడ్డి, నరసింహారెడ్డి, వాజీదల్లి సర్పంచ్ పోరం మాజీ అధ్యక్షులు రమేష్ గౌడ్ మాజీ వైస్ ఎంపీపీ మనోహర్ నాయకులు ఉమ్మడి మండలాల టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు సత్యనారాయణ, సీడీసీచైర్మన్ గంగారెడ్డి, నాయకులు విజయకుమార్, అహ్మద్ అలీ వై.నారాయణ మాజీ ఎంపీటీసీలు సర్పంచ్‌లు ఉన్నారు.

పిట్లం: స్థానిక బీఆర్ఎస్ కార్యాలయంలో సోమ వారం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా మాజీ సీఎంకేసీఆర్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. జన్మదినం సందర్బంగా కేక్ కటింగ్ చెసినారు. ఈకార్య క్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు రమేష్, శ్రీనివాస్‌రెడ్డి, విజయ్, శ్రీనివాస్‌రెడ్డి, నర్సాగౌడ్,నారాయ ణరెడ్డి, కరీం నాయకులు పాలోన్నారు.

నాగిరెడ్డిపేట: నాగిరెడ్డిపేట మండల కేంద్రంలో మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు జన్మదిన వేడుకలను సోమవారం మండల బీఆర్ఎస్ పార్టీ నా యకులు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్ర మంలో మండల బీఆర్ఎస్ అధ్యక్షులు సిద్దయ్య, నాయ కులుపాల్గొన్నారు.

ఎల్లారెడ్డి: బీఆర్ఎస్ పార్టీ అధినేత మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర రావు జన్మదిన వేడుకలను ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో సోమవారం మాజీ ఎమ్మె ల్యే సురేందర్ ఫాం వద్ద కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేసి ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జలంధర్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఆదిమూలం సతీష్ కుమార్, కపిల్ రెడ్డి, బలరాం నాయక్,నాయకులు రాజు, సాయిలు, రాము, దీవీటి రమేష్, ఇమ్రాన్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మద్నూర్: ఉమ్మడి మద్నూర్ మండలంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలను బిఆర్ఎస్‌నాయకులు, కార్యకర్తలు ఘనంగా జరుపుకున్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలను మద్నూర్ మండలం మే నూర్ గ్రామంలో నాయకులు, కార్యకర్తలు ఘనంగా జరుపుకున్నారు.ఈ కార్యక్రమంలో మండల బిఆర్ఎస్ అధ్యక్షులు బస్సీ పటేల్, ఉపాధ్యక్షులు గోవింద్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సదాశివనగర్: మండల కేంద్రంలో మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు పుట్టినరోజు వేడుకలను బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. తెలంగాణ జాతిపిత కేసీఆర్ తెలంగాణ ప్రజల గుండెల్లో కలకాలం నిలిచిపోతారని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బద్దం శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు మరికంటి బుచ్చయ్యమహేందర్‌రెడ్డి, సాయాగౌడ్, బాల్‌రెడ్డి,రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రామారెడ్డి: రాష్ట్ర ప్రదాత బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, భారత రాష్ట్ర సమితి అధ్యక్షులు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు 71వ జన్మదినాన్ని సోమవారం పురస్కరించుకొని కామారెడ్డి మాజీ శాసనసభ్యులు ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఆదేశాల మేరకు వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈకార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు రాజాగౌడ్, కాసల రాజేందర్ మరిమాజీ జిల్లా డైరెక్టర్ కాసర్ల రాజేందర్ మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ దండ బోయిన సిద్ధరాములు, మల్లేష్, నరేష్ , బాల్ దేవ్ అంజయ్య, హన్మేల్ల రాజయ్య, కాసర్ల స్వామి, రవి, బైరయ్య, కర్రోళ్ల రాజు, కుశనోళ్ల రాజు, పూసల లింగం, నోముల లింగం, జంగం లింగం, దుబ్బాక లక్ష్మణ్, బండి శ్రీనివాస్, గొర్రె శంకర్, బీఆర్ఎస్ నాయకులుపాల్గొన్నారు.

దోమకొండ: తెలంగాణ మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు జన్మదినం సందర్భంగా సోమవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గంధ్ర మధుసూదన్‌రావు ఆధ్వర్యంలో గాంధీ చౌరస్తాలో కేక్ కట్ చేసి సంబారాలు నిర్వహించారు.

బాన్సువాడ: మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ నాయకుడు షేక్ జుబేర్ ఆధ్వర్యంలో బాన్సువాడలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మోచి గణేష్, సాయిబాబా, రమేష్, సూరి, నవీన్ అఫ్రోజ్,నర్సింగ్ గౌడ్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

కేజీబీవీలో విద్యార్థులకు కంటి పరీక్షలు

రాజంపేట, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కేజీబీవీ బాలికల వసతి గృహంలో సోమవారం కంటి వైద్య శిబిరం నిర్వహించినట్లు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ విజయ మహాలక్ష్మీ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 224 మంది బాలికలకు వైద్య పరీక్షలు నిర్వహించి 67 మంది విద్యార్థులకు మందులు అందజేసి విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు వాణి, సూపర్‌వైజర్ మంజుల, నాగలక్ష్మీ, ఏఎన్ఎం సబిత తదితరులు పాల్గొన్నారు.


కమిషనర్‌కు వినతి పత్రం అందిస్తున్న నాయకులు

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఈనెల 19న ధర్నా నిర్వహించనున్నట్లు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు తెలిపారు. సోమవారం మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం 26 వేలు ఇవ్వాలని, మార్చిలో జరిగే బడ్జెట్ సమావేశంలో మున్సిపల్ కార్మికులకు బడ్జెట్ కేటాయించాలని, ప్రతీనెల 5న జీతాలు ఇవ్వాలని అన్నారు. అదేవిధంగా కామారెడ్డి మున్సిపల్‌లో పాత పద్ధతిన రెండు హాజరు పాయింట్లు పెట్టాలని, రెండు జతల బట్టలు, సబ్బులు, నూనెలు, నాణ్యమైన చీపుర్లు, పనిముట్లు ట్రెజరీ ద్వారా కాకుండా మున్సిపల్‌లో నేరుగా జీతాలు చెల్లించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు రాజనర్సు, జిల్లా కార్యదర్శి మహబూబ్‌అలీ, జిల్లా ఉపాధ్యక్షుడు ప్రభు తదితరులు పాల్గొన్నారు.


నియామక పత్రాలు అందజేస్తున్న ఎంఈవో ప్రవీణ్‌కుమార్

2008 డీస్సీ ఉపాధ్యాయుల నియామకం

పెద్ద కొడప్‌గల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): పెద్ద కొడప్‌గల్ మండలానికి 2008 డీస్సీకి సంబందించి నలుగురు ఉపాధ్యాయులు నియామకం అయినట్లు మండల విద్యాధికారి ప్రవీణ్ కుమార్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 2008 డీఎస్సీ అభ్యర్థులకు పోస్టింగ్‌లు ఇవ్వగా పెద్ద కొడప్‌గల్ మండలానికి నలుగురు వచ్చినట్లు తెలిపారు. ఇందులో సోమవారం ఇద్దరు ఉపాధ్యాయులు రిపోర్ట్ చేయగా మరో ఇద్దరు రిపోర్టు చేయలేదని తెలిపారు. ఈ నలుగులు ఉపాధ్యాయుల రాకతో మండలంలో ఉపాధ్యాయుల కొరత తీరిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీలు గోపాల్, రాములు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌ల అందజేత


పిట్లం, ఫిబ్రవరి 17: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కాశిరెడ్డి పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు అందజేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి మంచి ర్యాంకులు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో దేవీసింగ్, లయన్స్ సభ్యులు వేణు, రాజు, బాలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ఎల్లారెడ్డిలో రైతు పొలం బాటలో విద్యుత్ అధికారులు

రైతు పొలం బాటలో విద్యుత్ అధికారులు

ఎల్లారెడ్డి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): రైతులకు విద్యుత్ సరఫరాలో ఉన్న సమస్యలను నేరుగా తెలుసుకోవడానికి ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ ఆధ్వర్యంలో విద్యుత్ శాఖ రైతు పొలం బాట కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎల్లారెడ్డి డీఈ విజయ సారధి అన్నారు. సోమవారం ఎల్లారెడ్డి శివారు వ్యవసాయ ప్రాంతంలో ట్రాన్స్‌ఫార్మర్ల వద్దకు వెళ్లి రైతు పొలంబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈ విజయ సారధి మాట్లాడుతూ రైతుల వద్దకు వెళ్లి వారి సమస్యలను నేరుగా తెలుసుకుంటున్నామని అదేవిధంగా రైతులకు కూడా విద్యుత్‌పరంగా ఏమైనా ఇబ్బందులు ఉంటే విద్యుత్ అధికారులకు తెలియజేయాలని రైతులు విద్యుత్ మరమ్మతులు చేయకూడదని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడీ ప్రసాద్‌రెడ్డి, ఏఈ వెంకటస్వామి లైన్‌మెన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి


మృతి చెందిన సాయికుమార్(ఫైల్)

రాజంపేట, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని తలమడ్ల గ్రామానికి చెందిన కోదండం సాయికుమార్(18) అనే యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ పుష్పరాజ్ తెలిపారు. తుప్రాన్‌లో ఐటీఐ చదువుతున్న సాయికుమార్ కళాశాలకు వెళ్లకుండా ఇంటివద్దే ఉంటూ వ్యవసాయం చేసుకుంటున్నాడు. దీంతో తల్లిదండ్రులు కళాశాలకు వెళ్లి చదువుకోవాలని మందలించడంతో తీవ్ర మనస్థాపం చెంది ఈనెల 15న రాత్రి గడ్డిమందు తాగడంతో కుటుంబ సభ్యులు సిరిసిల్లా జిల్లా ఎల్లారెడ్డిపేట అశ్విని ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ సోమవారం సాయికుమార్ మృతి చెందాడు. దీంతో మృతుడి తండ్రి సాయిలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి : జుక్కల్ ఎమ్మెల్యే


మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోట లక్ష్మికాంతారావ్

పిట్లం ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి చదివితే విజయం తప్పకుండా సాధ్యమవుతుందని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మికాంతారావ్‌అన్నారు.స్థానిక బ్లూబెల్స్ హైస్కూల్ పాఠశాలలో 24వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం రాత్రి నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఎమ్మెల్యేకు పాఠశాల కరస్పాడెంట్, సిబ్బంది, విద్యార్థులు ఘనంగా స్వాగతం పలికినారు.ఎమ్మెల్యే చేతుల మీదుగా విద్యార్థులుకు ప్రశంసా పత్రాలు అందుకన్నారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి, మంచి విజయాలు సాధిస్తే గురువులు,తల్లితండ్రులు ఎంతో సంతోషపడతారన్నారు.విద్యార్థులు ఫోన్లు ఎక్కువగా వాడరాదన్నారు.సామాజిక మాధ్యమాలలో మంచి చెడు ఉంటాయని మంచిని ప్రవర్తించాలన్నారు.పాఠశాలలో84మంది విద్యార్థులకు ఉచితంగా విద్యను అందిచడం పట్ల పాఠశాల యజమానులకు అభినందనాలు తెలిపారు.పాఠశాల 24వ వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థుల నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి.ఈకార్యక్రమంలో ఏఎంసీ చైర్మెన్ మనోజ్‌కుమార్, వైస్ చైర్మెన్ కృష్ణారెడ్డి, విండో చైర్మెన్ శపథంరెడ్డి, జిల్లా డీసీసీ సభ్యులు సాయిరెడ్డి, ఎంఈఓ ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

శిథిలావస్థకు చేరిన విఠల్‌వాడీ తండాల మధ్య వంతెన

పెద్ద కొడప్‌గల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విఠల్‌వాడీ- విఠల్‌వాడీ తండాల మధ్య గల వాగుపై వంతెన శిథిలాస్థకు చేరి సంవత్సరంకు పైగా అయింది. గత వర్షాకాలం సమయంలో వంతెన కిం ద గల పిల్లర్లలో ఒకటి కుంగిపోయి కూలి పోయే దశకు చేరింది. అప్పటి నుండి సంవ త్సరం పైగా అవుతున్న వంతెన అలాగే ఉండిపోయింది. రానున్న రోజుల్లో వర్షాకాలం ప్రార ంభం అయి భారీ వర్షాలు కురిస్తే ఈ వంతెన కూలిపోయే ఆస్కారం ఉందని ఆయా గ్రామాల ప్రజలు చర్చించుకుంటు న్నారు. ఈ వంతెన మీదుగానే లింగంపల్లి, బాబల్‌గాం, విఠల్‌వాడీ గ్రామాల ప్రజలు పెద్ద కొడప్‌గల్‌కు పయనించాలి. అంతేగాక ఇటువైపు గ్రామాల ప్రజలు కౌలాస్‌నాలా ప్రాజెక్ట్‌కు గాని జుక్కల్ వెల్లాలంటే ఈ వంతెన పై నుండే ప్రయాణించాలి. సంవత్సరంకు పైగా అవుతున్న వంతెన నిర్మాణం కాకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రానున్న వర్షకాలం లోపు వంతెన నిర్మాణం పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఆకట్టుకున్న వ్యర్థాలతో
అర్థవంతమైన వస్తువుల ప్రదర్శన

బాన్సువాడ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో వ్యర్థాలతో అర్థమంతమైన వస్తువుల తయారీ, వ్యర్థ పదార్థాలను ఉపయోగించి తయారు చేసిన పలు రకాల దుస్తులతో నిర్వహించిన ఫ్యాషన్ షో ఆకట్టుకుంది. రోజురోజుకు పెరుగుతున్న వ్యర్థ పదార్థాలను రీసైక్లింగ్ ద్వారా వినిగించుకోవడం ఎలా అనే దానిపై అవగాహన కల్పిస్తూ చిన్నారులలతో పాఠశాలలో కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ప్రిన్సిపల్ లావణ్య నరేష్ తెలిపారు. ఈ సందర్భంగా పలు వ్యర్థ పదార్థాలతో విద్యార్థులు తయారు చేసిన వస్తువులు ఆలోచింపజేశాయి. విద్యార్థులతో నిర్వహించిన ఫ్యాషన్ షో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకులు నరేష్ సిబ్బంది పాల్గొన్నారు.

త్రిలింగేశ్వరాలయానికి
కెమికల్ వాష్ పనులు ప్రారంభం

నాగిరెడ్డిపేట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): నాగిరెడ్డిపేట మండలం తాండూర్ గ్రామంలోని ప్రసిద్ధ ఆలయమైన శ్రీ లింగేశ్వరాలయానికి కెమికల్ వాష్ పనులను సోమవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఆలయానికి కెమికల్ వాష్ పనులు చేసేందుకుగాను స్థానిక పలువురు దాతలు సుమారు పది లక్షల రూపాయల విరాళాలు ఇవ్వడంతో ఆలయానికి కెమికల్ వాష్ పనులు ప్రారంభించారు. ఆలయానికి కెమికల్ వాష్ పనులు నిర్వహించేందుకుగాను బెంగాల్, హైదరాబాద్ నుంచి వర్కర్లు విచ్చేసినట్టు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు దత్తు తదితరులు పాల్గొన్నారు.

అడవిలో మోదుగ పూల మురిపం


కనువిందు చేస్తున్న మోదుగపూలు

పెద్ద కొడప్‌గల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రకృతిలో ఉన్న చెట్లు ఏ సీజన్ వస్తే ఆ సీజన్‌కు అనుకూలంగా పూలతో అందంగా పూస్తాయి. రానున్న పౌర్ణమి రోజు హోళి పర్వదినం ఉండటంతో ఆ పండగకు తామే రంగులవల్లులుగా ఉంటామంటూ అడవిలోని మోదుగ చెట్లు విరగబూయడంతో అడవిలో మోదుగ చెట్లు ఉన్న ప్రాంతం ఎరుపురంగుతో మారింది. గతంలో ఈ మోదుగ పూలతో రంగులు తయారు చేసి హోళి ఆడేవారు. రానురాను కెమికల్ రంగులకు అలవాటు పడిన ప్రజలు మోదుగ పూలను మరిచి కెమికల్ రంగులతో సంబరాలు చేసుకుంటున్నారు.

ఏపీఎం కార్యాలయంలో రికార్డుల పరిశీలన

రామారెడ్డి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): రామారెడ్డి ఏపీఎం కార్యాలయంలో సోమవారం సెర్ప్ అంతర్గత ఆడిట్ గ్రామ సంఘాల పుస్తకాలు, ఇతర సమాచారాలను తనిఖీ చేశారు. ప్రతీ నెల గ్రామ సంఘం పుస్తకాలు కంప్లీట్ చేసుకోవాలని, చిన్న సంఘం పుస్తకాలు తనిఖీ చేయాలని, ప్రతీ ఐదు సంఘాలకు ఒక్క బుక్‌పేర్ పెట్టుకోవాలని ఏపీఎం ప్రసన్నకుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సీబీవో ఆడిటర్ కుమార్, సీసీలు, శ్రీనివాస్, ప్రతాప్, సిబ్బంది పాల్గొన్నారు.


రామారెడ్డిలో రికార్డులను పరిశీలిస్తున్న అధికారి

విగ్రహ పున: ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే


బరంగేడ్గి పరమేశ్వర ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పోచారం

బీర్కూర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ మండలం బరంగేడ్గి గ్రామంలో గత మూడు రోజులుగా పరమేశ్వర ఆలయంలో విగ్రహ పున: ప్రతిష్ఠాపన కార్యక్రమాలు వైభవంగా జరుగుతున్నాయి. సోమవారం విగ్రహ పున : ప్రతిష్ఠాపన, ధ్వజ స్తంభ, కలిశ స్థాపన మహోత్సవ కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. ఇదిలా ఉండగా రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ ఎంఎల్ఏ పోచారం శ్రీనివాసరెడ్డి, మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డిలు విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ సన్నిధిలో కొనసాగుతున్న శివనామ సప్తహ 3వ వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ సన్నిధిలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వేలాది మంది భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీర్కూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ దుర్గం శ్యామల, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో సబ్ కలెక్టర్ బస


గురుకుల విద్యార్థినులతో కలిసి బస చేస్తున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి

బాన్సువాడ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బోర్లం సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ఆదివారం రాత్రి సబ్ కలెక్టర్ కిరణ్మయి బస చేశారు. ప్రిన్సిపాల్, సిబ్బందితో సమీక్షించారు. వసతుల గురించి ఆరా తీశారు. విద్యార్థినులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు.

అంబేద్కర్ విగ్రహ
ఏర్పాటు కోసం స్థలం ఎంపిక

నాగిరెడ్డిపేట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): నాగిరెడ్డిపేట మండలంలోని వాడి గ్రామంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు కోసం అధకారులు సోమవారం స్థలాన్ని ఎంపిక చేశారు. అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు విషయమై వివాదం తలెత్తడంతో విషయం తెలుసుకున్న ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నె ప్రభాకర్, ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు సోమవారం గ్రామానికి వెళ్లి గ్రామస్తులతో చర్చించి గ్రామస్తుల సమక్షంలో విగ్రహ ఏర్పాటు కోసం స్థలాన్ని ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై మల్లారెడ్డి, ఆర్ఐ మహ్మద్, గ్రామస్తులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయకుంటే పంచాయతీల నిర్వహణ కష్టమే


బీర్కూర్ ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న జీపీ కార్యదర్శులు

బీర్కూర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం వెంటనే స్పందించి గ్రామ పంచాయతీలకు నిధులు మంజూరు చేయాలని లేకుంటే నిర్వహణ చేయలేమని మండలంలోని గ్రామ పంచాయతీల కార్యదర్శులు తేల్చి చెప్పారు. సోమవారం బీర్కూర్ మండలంలోని ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీవో భానుప్రకాష్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొన్నాళ్లుగా ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు నిధులు విడుదల చేయడం లేదన్నారు. దీని వల్ల గ్రామ పంచాయతీల పరిపాలనపరంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించలేకపోతున్నామని తెలిపారు. నిధుల లేమి కారణంగా తాము సొంత డబ్బులు వెచ్చించి గ్రామాల్లో తాగునీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణ పనులు చేయించామన్నారు. ఈనెల 28వ తేదీలోపు తాము ఇప్పటి వరకు గ్రామాల్లో ఖర్చు పెట్టిన డబ్బులను, గ్రామ పంచాయతీలకు రావాల్సిన నిధులను ప్రభుత్వం విడుదల చేయాలని కోరారు. లేనియెడల గ్రామ పంచాయతీల నిర్వహణ చేయలేమన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీల కార్యదర్శులు శ్రీనివాస్, గురునాథ్, మోహన్, దివ్య, సుజాత, సతీష్ తదితరులు ఉన్నారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

దర్శన్ - క్యాప్టెన్ అమెరికా
ప్రియా 70 - లైలా
ప్రియా 35 - తండేల్

బాన్సువాడ

మహేశ్వరి - సంక్రాంతికి వస్తున్నాం
వెంకటేశ్వర - డాకు మహారాజ్

చికెన్ ధరలు




రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	120	140	160
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190